

సమస్యల పరిష్కారానికి కృషి

జిల్లాలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ ఫ్రాంక్లిన్ తెలిపారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం : 590 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం	: 589.10 అడుగులు
ఇన్‌ఫ్లో	: 46,039 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 46,039 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 28,501 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 10,120 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 5,018 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 2,400
వరద కాల్వకు	: నిల్

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం	: 645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 643.95 అడుగులు
ఇన్‌ఫ్లో	: 3390.14 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 3240.70 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 265.31 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 169.47 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

సస్యరక్షణతో అధిక దిగుబడులు



చిల్లెపల్లి గ్రామ సమీపంలో వరి చేను పరిశీలిస్తున్న డీఏఓ శ్రీధర్‌రెడ్డి

నేరేడుచర్ల : సస్య రక్షణతోనే వరి సాగులో అధిక దిగుబడులు వస్తాయని సూర్యాపేట జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి గ్రామ సమీపంలో గల వరి చేలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు వరి సాగులో సస్య రక్షణ చర్యలపై తగిన సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. సకాలంలో కలుపు నివారణ చర్యలను చేపట్టాలని సూచించారు. పంటలకు సరిపోయేలా ఎరువులను మాత్రమే ఉపయోగించుకోవాలన్నారు. చీడ పీడల నివారణకు అధిక ఎరువుల వినియోగం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్‌కె జావెద్, వ్యవసాయ విస్తరణ అధికారి నిర్మలతో పాటు పలువురు రైతులు తదితరులు ఉన్నారు.

అక్టోబర్ 1వరకు వారోత్సవాలు



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

భానుపురి (సూర్యాపేట) : వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి కె.నరసింహారావు, కోశాధికారి రవికుమార్ తెలిపారు. బుధవారం సూర్యాపేట కలెక్టరేట్‌లోని జిల్లా సంక్షేమ అధికారి చాంబర్‌లో వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వయోవద్ధుల కమిటీ మెంబర్లు రామకృష్ణారెడ్డి, విద్యాసాగర్, హమీద్ ఖాన్, భాస్కరాచారి, సుధాకర్, వెంకట్ రెడ్డి, హుస్సేన్, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి



సన్మాన కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ

మోతె: గ్రామాల అభివృద్ధికి ఉద్యోగులు బాధ్యతాయుతంగా పని చేయాలని జెడ్పీ సీఈఓ అప్పారావు సూచించారు. బుధవారం మోతె మండలం మామిళ్లగూడెం, తుమ్మలపల్లిలో పర్యటించారు. అనంతరం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా మామిళ్లగూడెంలో పంచాయతీ కార్యదర్శులు, పారిశుద్ధ్య సిబ్బందిని సన్మానించారు. అనంతరం వారికి ఆరోగ్య పరీక్షలు చేయించి మాట్లాడారు. కార్యక్రమంలో డీపీఓ నారాయణరెడ్డి, మోతె మండల ప్రత్యేకధికారి సీతారాంనాయక్, ఎంపీడీఓ ఆంజనేయులు,ఏపీఓ నగేష్, ఉపాధిహామీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత సాధించాలి

భువనగిరి టౌన్: నేటి సమాజంలో ఆర్థిక అక్షరాస్యత సాధించడం ఎంతో అవసరమని ఆర్‌బీఐ తెలంగాణ జనరల్ మేనేజర్ అనుజ్ రంజన్ అన్నారు. ఆర్‌బీఐ ఆధ్వర్యంలో తుర్కపల్లి మండలం రాంపూర్‌లోని మోడల్ స్కూల్ బుధవారం ఆర్థిక అక్షరాస్యత, స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతో సమావేశమై పరిసరాల పరిశుభ్రత, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. అనంతరం కళాబృందం చేత బ్యాంకింగ్ ప్రొడక్ట్ అయిన పీఎం సురక్ష బీమా, జీవన జ్యోతి బీమా పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఐ డీజీఎం జగదీశ్ కుమార్, ఏజీఎం గోమతి, ఎల్‌డీఎం శివరామకృష్ణ, లీడ్ బ్యాంకు ఆఫీసర్ వంశీ, సాయి పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఆర్‌బీఐ జనరల్ మేనేజర్

పేదలకు సొంతిల్లు!

నియోజకవర్గానికి 3,500చొప్పన ఇందిరమ్మ ఇళ్లు

- త్వరలో నెరవేరనున్న కల
- వారం రోజుల్లో విధి విధానాలు ఖరారు
- అక్టోబర్ 15 నుంచి అర్హుల ఎంపిక
- ఆనందంలో దరఖాస్తుదారులు



సూర్యాపేట : నిరుపేదలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న సొంతింటి కళ నెరవేరనుంది. నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. వచ్చే నెల 15 నుంచి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని, వారం రోజుల్లో విధివిధానాలుసైతం ఖరారుకానున్నట్లు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల ప్రకటించడంతో పేదల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రజాపాలనలో ఈ పథకం కింద జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న 3,16,885 మంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దరఖాస్తుదారుల్లో నుంచి లబ్ధిదారుల ఎంపిక

అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధానమైంది. ఈ పథకం కింద లబ్ధిదారుల ఇంటి నిర్మాణానికి అవసరమైన ఐదు లక్షల ఆర్థిక సాయాన్ని అందించనున్నట్లు ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ప్రకటించింది. స్థలం లేని వారికి స్థలంతో పాటు ఇంటిని నిర్మించి ఇస్తామని తెలిపింది. ఎన్నికలు పూర్తయి తొమ్మిది నెలలు కావస్తోంది. దీంతో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి వచ్చేనెల శ్రీకారం చుట్టడానికి కసరత్తు చేస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులను అక్టోబర్ 15వ తేదీ నుంచి ప్రభుత్వం ఎంపిక చేయనుంది. ఈ ఎంపిక విధానం ఎలా ఉండాలన్న దానికి సంబంధించి విధివిధానాలు వారం రోజుల్లోనే జారీ కానున్నాయి. వీటి ప్రకారం జిల్లాలో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల నుంచి ఎంపిక ఉండనుంది. ప్రధానంగా ఇంటి నిర్మాణానికి స్థలం ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఒక్కో నియోజకవర్గంలో 3500 మంది లబ్ధిదారులను గుర్తించనున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున ఇవ్వాల్సి ఉండగా కేంద్ర ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి సంబంధించి పథకాన్ని అమలు చేస్తుంది. ఈ పథకంలో చేరితే రాష్ట్ర ప్రభుత్వంపై కొంత ఆర్థిక భారం తగ్గుతుందన్న ఆలోచనతో ఇందుకు సంబంధించిన విధివిధానాలను రూపొందిస్తారా లేదంటే నూతనంగా మార్గదర్శకాలు ఉంటాయా అన్నది తేలాల్సి ఉంది.

విధివిధానాలు ప్రకటిస్తేనే..

ఇందిరమ్మ ఇళ్ల కోసం లబ్ధిదారులను ఎంపిక చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో దరఖాస్తుదారులు ఆనందంలో ఉన్నారు. 10 సంవత్సరాలుగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించి ఇస్తామని బీఆర్ఎస్ ప్రభుత్వం చెప్పినా ఎక్కడ అమలు కాలేదు. దీంతో లక్షలాది మంది పేద ప్రజలు సొంత ఇంటి కల కోసం ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. తీరా గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి ప్రభుత్వమే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కాకుండా ఇళ్లు నిర్మించుకుంటే రూ.3 లక్షల ఆర్థిక సహాయం చేస్తామని ప్రకటించింది. ఈ పథకానికి లబ్ధిదారులను ఎంపిక చేసినప్పటికీ పూర్తిగా పార్టీ కార్యకర్తలకే ఇచ్చారన్న విమర్శలు ఉన్నాయి. అయితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తాము రూ.5 లక్షల ఆర్థిక సహాయం చేస్తామని ప్రకటించడంతో పేదవర్గాలన్నీ నమ్మి కాంగ్రెస్ కు అధికారం అప్పచెప్పాయి. ఈ నేపథ్యంలోనే పదేళ్లకు పైగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేదల ఎంపిక ఎలా ఉంటుందన్నది ఆసక్తిగా మారింది. విధివిధానాలు ప్రకటిస్తే స్పష్టత రానుంది.

కాంగ్రెస్ పాలనపై ఉద్యమిద్దాం



ఉమ్మడి జిల్లా నేతలతో మాట్లాడుతున్న కేటీఆర్

- ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ నేతలకు కేటీఆర్ దిశానిర్దేశం
- హైదరాబాద్‌లోని జగదీష్‌రెడ్డి నివాసంలో సమావేశం

నల్లగొండ టూటౌన్: అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు ప్రభుత్వంపై ఉద్యమించాలని, ఆందోళనకు సిద్ధం కావాలని ముఖ్యనాయకులకు దిశా నిర్దేశం చేశారు. బుధవారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి నివాసంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా నాయకులతో సమావేశమై ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించారు. పార్టీ కార్యకర్తలకు నాయకులంతా అందుబాటులో ఉండాలని, పార్టీని కింది స్థాయి నుంచి పటిష్టపరుచుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. జిల్లాలో మంత్రులు, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల అవినీతి అక్రమాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా ద్రోహం చేశారన్నారు. ఈ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నదన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, రవీంద్ర కుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, భాస్కర్‌రావు, గాదరి కిషోర్, నోముల భగత్, చిరుమర్తి లింగయ్య, బొల్లం మల్లయ్య యాదవ్, మాజీ ఎంపీ లింగయ్య యాదవ్, జెడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పలువురు ఎస్ఐల బదిలీ

నల్లగొండ క్రైం : జిల్లాలో పలువురు ఎస్ఐలను బదిలీ చేస్తూ నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొందరికి ఆయా మండలాల్లో పోస్టింగ్ ఇవ్వగా.. మరికొందరిని వీఆర్‌కు అటాచ్ చేశారు. ఖాళీగా ఉన్న మిర్యాలగూడ రూరల్ పీఎస్‌కు ఇద్దరిని కేటాయించారు.

ఎస్ఐల బదిలీ ఇలా..

పేరు	ప్రస్తుతం	బదిలీస్థానం
బి.మహేశ్వర్	డీఎస్‌బి నల్లగొండ	డీఎస్‌బి సూర్యాపేట
బి.వెంకటేశ్వర్లు	వీఆర్ నల్లగొండ	కోదాడ
ఎస్‌కె.సైదులు	డీసీఆర్‌బి నల్లగొండ	కోదాడ టౌన్
ఎస్.క్రిష్ణయ్య	మిర్యాలగూడ టూటౌన్ ఎస్ఐ-2	మాడ్గులపల్లి
ఎస్ఐ శోభన్‌బాబు	మాడ్గులపల్లి	వీఆర్ నల్లగొండ
డి.వెంకటేశ్వర్లు	డీసీఆర్‌బి సూర్యాపేట	వేములపల్లి
విజయ్‌కుమార్	వేములపల్లి	వీఆర్ నల్లగొండ
లోకేష్‌కుమార్	సూర్యాపేట వన్‌టౌన్	మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ-1
ఎన్.సందీప్‌రెడ్డి	నల్లగొండ వన్‌టౌన్	మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ-2
బి.శేఖర్	మిర్యాలగూడ వన్‌టౌన్	అడవిదేవులపల్లి
జి.సాయిప్రశాంత్	సీసీఎస్ సూర్యాపేట	తిప్పర్తి

పర్యాటక కేంద్రాలను సందర్శించాలి



పర్యాటక ప్రాంతాల సందర్శనకు వెళ్తున్న విద్యార్థుల బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఐఈఓ,డీఈఓ

సూర్యాపేటటౌన్ : మన పరిసర ప్రాంతాల్లో ఉన్న పర్యాటక ప్రాంతాలను సందర్శించాలని డీఐఈఓ భానునాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి కె.అశోక్ అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా బుధవారం సూర్యాపేట జిల్లాలోని పర్యాటక కేంద్రాల సందర్శనకు వెళ్తున్న పాఠశాల, కళాశాల విద్యార్థుల బస్సులను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వారు జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలోని చింతలపాలెం మండలంలో గల పులిచింతల ప్రాజెక్టు, పిల్లలమర్రి శివాలయం, దురాజ్‌పల్లి లోని లింగమంతుల స్వామి దేవాలయం, నాగారం మండలంలోని ఫణిగిరి లో గల బుద్ధిష్ట్ మ్యూజి యం, మూసీ నది, చివ్వెంల మండలంలోని ఉండ్రుగొండ, మట్టపల్లి లోని లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం, పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ దర్గా, హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డ లోగల అనంత పద్మనాభ స్వామి దేవాలయం, జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లిలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయాలను విద్యార్థులు సందర్శిస్తారన్నారు. విద్యార్థులు 25, 26, 27తేదీల్లో మూడు రోజులు సందర్శించేందుకు కలెక్టర్ అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ పి.యాదయ్య, సీహెచ్. కృష్ణ, శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, నవీన్, అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో విశేష పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం నిత్య పూజలు విశేషంగా కొనసాగాయి. వేకువజామునే ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు స్వయంభూ, ప్రతిష్టా అలంకార మూర్తులకు సుప్రభాతం, అర్చన, అభిషేకం వంటి సంప్రదాయ పూజలను నిర్వహించారు. అనంతరం ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు చేపట్టారు. ఇక ఆలయంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం వంటి పూజలను విశేషంగా జరిపించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం జరిపించి, ద్వారా బంధనం చేశారు.

కేసుల దర్యాప్తులో మెళకువలు నేర్చుకోవడానికి దోహదం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, చిత్రంలో అధికారులు

సూర్యాపేటటౌన్ : సాంకేతిక పరిజ్ఞానంతో పాటు కేసుల దర్యాప్తుల్లో మెళకువలు నేర్చుకునేందుకు పోలీస్ డ్యూటీ మీట్ దోహదపడుతుందని ఏఎస్పీ నాగేశ్వర్‌రావు అన్నారు. బుధవారం జిల్లా స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో భాగంగా ఆర్మ్‌డ్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో పోలీస్ సిబ్బందికి పోటీలు ప్రారంభించి మాట్లాడారు. కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్ , ఫింగర్ ప్రింట్స్, హ్యాండ్లింగ్, లిఫ్టింగ్ , బాంబు డిస్పోజల్ స్క్వాడ్, పోలీస్ జాగిల విభాగంలో ట్రాకింగ్, ఎక్స్‌ప్లోజివ్, వీడియో అనాలసిస్ విభాగాల్లో పోటీలు నిర్వహించినట్లు వివరించారు. పోటీల్లో 50 మంది పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ జనార్దన్ రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ మట్టయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వీర రాఘవులు పాల్గొన్నారు.

విద్యార్థి కంటికి రక్షణ

- ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో కంటి పరీక్షలు
- ఆగస్టు 20 నుంచి కొనసాగుతున్న ప్రక్రియ
- ఇప్పటి వరకు 20,651 మందికి పరీక్షలు



తిరుమలగిరి (తుంగతుర్తి) : జీవన విధానంలో మార్పులతో విద్యార్థుల్లో రోజు రోజుకూ కంటి సమస్యలు పెరిగి పోతున్నాయి. దృష్టి లోపంతో చిన్నారులకు తరగతి గదిలో బోర్డుపై రాస్తున్న అక్షరాలు, పుస్తకాల్లో చిన్న అక్షరాలు స్పష్టంగా కనిపించడం లేదు. ఆడుకునే సమయంలో కంటి అద్దాలు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కరోనా సమయంలో ఆన్‌లైన్ తరగతులు వినడానికి చాలా మంది తల్లిదండ్రులు స్మార్ట్ ఫోన్‌లు పిల్లలకు కొనిచ్చారు. అప్పటి నుంచి అలవాటై తదనంతరం తల్లిదండ్రుల పర్యవేక్షణ లేక దారి తప్పి సమస్య మరింత పెరిగింది. పోషకాహార లోపంతోనూ సమస్యలు వస్తున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో తొలి దశలోనే సమస్యను గుర్తించి పరిష్కరించాలని కుటుంబ, ఆరోగ్య సంక్షేమ శాఖ ప్రత్యేకంగా విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. ఆర్‌బీఎస్‌కే(రాష్ట్రీయ బాల్ స్వస్థ్య కార్యక్రమం) ఆధ్వర్యంలో ఆగస్టు20 నుంచి జిల్లాలో ప్రారంభించారు.

771మందికి కంటి సంబంధ వ్యాధులు

జిల్లాలో ఇప్పటి వరకు 390 ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 3 ప్రత్యేక బృందాలతో విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. మొత్తం 48,550 మందిని పరీక్షించాల్సి ఉంది. ఇప్పటి వరకు 20,651 మందికి పరీక్షలు నిర్వహించగా 771 మందికి కంటికి సంబంధించిన వ్యాధులతో బాధపడుతున్నట్లు గుర్తించారు.

సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలి

ఒకప్పుడు వృద్ధులకు పరిమితమైన కంటి సమస్యలు ప్రస్తుతం విద్యార్థి దశలోనే రావడం ఆందోళనకర విషయం. కంటి పరీక్షలకు ప్రధాన కారణం అతిగా సెలఫోన్లు చూడటమే. వాటిని వీలైనంత వరకు తగ్గించాలి. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి.

– కోటాచలం, జిల్లా వైద్యాధికారి


గత విద్యా సంవత్సరంలో కూడా..

ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో విద్యార్థిలకు పరిశుభ్రత, అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పిస్తూ జ్వరాలు వచ్చిన వారికి చికిత్సలు చేస్తున్నారు. కంటి సమస్యలు ఉన్న విద్యార్థులను గుర్తించి పరీక్షలు చేస్తూ అవసరమైన వారికి అద్దాలు, మందులు అందజేసేందుకు చర్యలు చేపడుతున్నారు. గత విద్యా సంవత్సరం ఏప్రిల్ నెలలో వైద్య ఆరోగ్య శాఖ నుంచి ఆదేశాలు రావడంతో పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం వారికి కంటి అద్దాలు ఇవ్వనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

గుట్టల మధ్య నడిచి.. గిరిదుర్గం సందర్శించి..



గిరిదుర్గం వద్ద రాళ్ల మధ్య నుంచి నడుస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



బైనాక్యులర్‌తో గిరిదుర్గం ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

చివ్వెంల(సూర్యాపేట) : కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ బుధవారం చివ్వెంల మండలంలోని ఉండ్రుగొండ గిరిదుర్గంను సందర్శించారు. గుట్టల మధ్య వెలసిన శ్రీలక్ష్మీ నర్సింహాస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాళ్లు, చెట్ల పొదల మధ్య నుంచి నడుచుకుంటూ వెళ్లి ఆలయాలు, కోనేరులు, కట్టడాలు, చారిత్రక ప్రాకారాలు పరిశీలించారు. గిరిదుర్గం అందాలను బైనాక్యులర్ ద్వారా తిలకించారు. అంతకుముందు ఆలయ కమిటీ ప్రతినిధులు కలెక్టర్‌కు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉండ్రుగొండ గిరిదుర్గంను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.గిరిదుర్గం హైదరాబాద్ -విజయవాడ జాతీయ రహదారి నుంచి లోపలికి ఉండటం, రవాణా సౌకర్యం సరిగా లేకపోవడంతో అంతగా ప్రాచుర్యంలోకి రాలేదన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ వేణుమాధవ్, డీఎఫ్ఓ సతీష్ కుమార్, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి ఎ.రమేష్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు ఆదుర్తి రామయ్య, మహేశ్వరం , రవిచంద్ర, చకిలం కృష్ణకుమార్, కృష్ణమోహన్, శ్రీరాములు, మురళీకృష్ణ, జుట్టుకొండ సత్యనారాయణ, భరద్వాజ పాల్గొన్నారు.



గిరిదుర్గం వద్ద ఆలయ కమిటీ ప్రతినిధులు, అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలకు కృషిచేస్తా

- తెలంగాణ లెక్చరర్స్ ఫోరం రాష్ట్ర చైర్మన్ వెంకటస్వామి

సూర్యాపేటటౌన్ : త్వరలో సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలకు కృషి చేస్తామని తెలంగాణ లెక్చరర్స్ ఫోరం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కత్తి వెంకటస్వామి హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర విద్యా వ్యవస్థ సమాలోచన సదస్సుకు సంబంధించిన కరపత్రాలను సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సాయి త్రివేణి డిగ్రీ కళాశాలలో బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. మూడేళ్ల నుంచి జూనియర్, డిగ్రీ కళాశాలలు, ఇతర కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాక కాలేజీల యాజమాన్యాలు, అధ్యాపకులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ ఎడ్యుకేషన్ తెలంగాణ పేరుతో ఈనెల 29న నల్లగొండలోని ప్రభుత్వ లెక్చరర్స్ భవన్‌లో జరిగే తెలంగాణ రాష్ట్ర విద్యా వ్యవస్థ సమాలోచన సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక రాష్ట్ర సాధనే లక్ష్యంగా ఆవిర్భవించిన ఉద్యమ సంస్థ తెలంగాణ లెక్చరర్స్ ఫోరమన్నారు. ఈ కార్యక్రమంలో టీఎల్ఎఫ్ గ్రాడ్యుయేట్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పెసర జనార్దన్ రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గంజికుంట్ల గోపినాథ్, రాష్ట్ర కార్యదర్శి తన్నీరు ఉపేందర్, జిల్లా అధ్యక్షుడు ఎల్.నాగేశ్వరరావు, బెంజారపు రమేష్ గౌడ్, బయ్య దేవేందర్ యాదవ్, ముజీబ్, అనిల్ కుమార్, అధ్యాపకులు ఉయ్యాల నర్సయ్య, జె. వెంకట్ రెడ్డి, నాగేశ్వరరావు, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న టీఎల్ఎఫ్ నాయకులు

క్లుప్తంగా

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



ఉరి వేసుకుకున్న శివశంకర్

భువనగిరి క్రైం: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన భువనగిరి పట్టణంలోని అర్బన్ కాలనీలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. అర్బన్‌కాలనీకి చెందిన చేనేత కార్మికుడు ముదిగొండ శివ శంకర్(42) మిర్చీ బండి నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై ఆర్‌బీ నగర్‌లోని తన దుకాణంలో ఆత్మహత్యకు పాలపడ్డాడు. అతడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కుమారస్వామి తెలిపారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం



ఆలయంలో స్వామివారి నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని బుధవారం విశేషంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల సంవాదం నిర్వహించి కల్యాణతంతును పూర్తిగావించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు, భక్తులు పాల్గొన్నారు.

30 నుంచి పవిత్రోత్సవాలు

మఠంపల్లి: మట్టపల్లిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఈనెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించేందుకు ఆలయ పాలక వర్గం అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా ఏర్పాట్లను బుధవారం ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్ పరిశీలించారు. ఈనెల 30న సాయంత్రం 7గంటలకు పవిత్రోత్సవాలను యాజ్ఞీకులు ఖమ్మం జిల్లా ముత్తారానికి చెందిన బొర్రా వెంకటవాసుదేవాచార్యులు ఆయన బృందం ఆధ్వర్యంలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. వచ్చే నెల 1న విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, వాస్తుపూజ, వాస్తు హోమం ఉంటుందని, 2న దేవతా ఆహ్వానం, ప్రధాన హోమం, బలిహరణ ఉంటుందని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారని, ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

శాటిలైట్ టోల్ వసూల్!

- హైవేలపై టోల్ బూత్‌ల ఎత్తివేతకు కేంద్రం యోచన
- గ్లోబల్ నావిగేషన్‌తో వాహన బారులకు చెక్
- త్వరలో ఉమ్మడి జిల్లా టోల్ ప్లాజాల వద్ద అమలు



బీబీనగర్: జాతీయ రహదారులపై ఉన్న టోల్ ప్లాజాల వద్ద త్వరలో టోల్‌బూత్‌లు లేకుండా నేరుగా వాహనాలు వెళ్లేలా సరికొత్త విధానం అమల్లోకి రానుంది. ప్రస్తుతం టోల్ ప్లాజాల వద్ద ఫాస్టాగ్ సెన్సార్, మ్యానువల్‌గా టోల్ వసూళ్లు కొనసాగుతున్నాయి. దీంతో టోల్ ప్లాజాల వద్ద వీకెండ్, పండుగలు, సెలవుల సమయాల్లో వాహనాలు కిలోమీటరు పొడవున బారులుదీరుతుండడంతో ట్రాఫిక్ జామ్ అయ్యి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక నుంచి వాహనాలు ఎక్కడా ఆగకుండా చెల్లింపుల విధానం లేకుండా కేంద్ర ప్రభుత్వం సరికొత్త విధానాన్ని అమల్లోకి తీసుకురావాలని భావిస్తోంది.

గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్‌తో..

హైవేలపై టోల్ ప్లాజాల వద్ద టోల్ బూత్‌ల నిర్వహణను తొలగించి టోల్ పరిధిలోని హైవేపై ప్రయాణించే వాహనాలను గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టంతో రోడ్లపై, వాహనాల్లో సాంకేతిక ఏర్పాట్లు అనుసంధానం చేసి టోల్ ప్లాజా నుంచి మాత్రమే వెళ్లే వాహనదారుల ఖాతాల్లో నుంచి దూరాన్ని బట్టి నేరుగా డబ్బులు కట్ అయ్యే విధానం అమలు చేయనున్నట్లు సమాచారం.



గూడూరు వద్ద టోల్‌ప్లాజా

జీపీఎస్‌తో అనుసంధానం

కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన కొత్త విధానంలో ప్రతి వాహనం ఆన్‌బోర్డు యూనిట్‌లను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. వాహనం రోడ్డుపై ఎంత దూరం ప్రయాణించిందో నిర్ధారించేలా రోడ్డు మార్గంలో పలుచోట్ల ప్రత్యేక కెమెరాలు ఏర్పాటు చేస్తారు. కెమెరాలను గుర్తించే విధంగా ఆయా మార్గాల్లో శాటిలైట్ల వ్యవస్థలను ఏర్పాటు చేస్తారు. దీంతో వాహనం దూరాన్ని బట్టి వాహనదారుడి టోల్‌తో అనుసంధానం చేసిన ఖాతాల్లో నుంచి వెంటనే డబ్బులు కట్ అవుతాయి.

టోల్ ప్లాజాలు ఎత్తివేసే అవకాశం

గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం ద్వారా వాహనాలకు సంబంధించి టోల్ వసూలు సక్రమంగా జరిగితే హైవేలపై గల టోల్ ప్లాజాలను ఎత్తివేసే అవకాశం ఉంది. టోల్ బూత్‌ల వద్ద ఫాస్టాగ్ సెన్సార్‌లు నిర్ణీత సమయంలో సాంకేతిక లోపంతో పని చేయకపోవడంతో వాహనాలు బారులుదీరడం, డబ్బులు చెల్లింపు బూత్‌ల ఆలస్యం అవుతుండడంతో టోల్ ప్లాజాల్లో వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోతున్నాయి. దీనికి చెక్ పెట్టి శాటిలైట్ విధానాన్ని అమలు చేసి టోల్ బూత్‌లు, ప్లాజాలను క్రమక్రమంగా ఎత్తివేసే యోచనలో కేంద్ర ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. దీంతో ఉమ్మడి నల్లగొండ పరిధిలో జాతీయ రహదారిపై గల గూడూరు టోల్ ప్లాజా, చౌటుప్పల్, కేతపల్లి, ఆలేరు పరిధిలోని టోల్‌ప్లాజాల గుండా ప్రయాణించే వాహనదారులకు త్వరలో ఇబ్బందులు తొలగనున్నాయి.

ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్న పరిశీలన

వాహనదారులు టోల్ ప్లాజాల వద్ద నిరీక్షించకుండా వెళ్లే విధంగా ఫాస్టాగ్, మాన్యువల్ వసూళ్ల సిస్టంకు స్వస్తి పలికే విధంగా కేంద్ర ప్రభుత్వం విన్నూతనంగా చేపడుతున్న కొత్త విధానాన్ని ఇప్పటికే కర్ణాటక, హరియాణ తదితర రాష్ట్రాల్లో గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టంను ఎక్స్‌ప్రెస్ హైవేలపై అమలు చేసి పరిశీలిస్తున్నారు. అనంతరం ఇతర హైవేలపై అమల్లోకి తేనున్నారు.

పరిశీలన జరుగుతోంది

గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం ద్వారా వాహనాల నుంచి టోల్ ప్లాజా రుసుంల చెల్లింపుల విధానాన్ని మొదటి దశలో ఎక్స్‌ప్రెస్ హైవేలపై పెట్టేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. అనంతరం అన్ని టోల్ ప్లాజా రహదారులపై అమలు చేసే అవకాశం ఉంది. ప్రస్తుతానికి మాకు ఎలాంటి ఆదేశాలు అందలేదు.

– సుధీర్, గూడూరు టోల్‌ప్లాజా మేనేజర్

లైంగికదాడి చేసి.. గొంతు నులిమి

- చున్నీతో ఉరివేసి చెట్టుకు వేలాడదీసి.. ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యత్నం
- సంచలనం సృష్టించిన యువతి హత్యకేసులో ముగ్గురు నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు

మిర్యాలగూడ అర్బన్: నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం పుట్టలగడ్డ గ్రామంలో ఈ నెల 14న యువతి అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. యువతిని ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించిన యువకుడు చివరికి ఆమె ఉసురు తీశాడని పోలీసులు తేల్చారు. సంచలనం సృష్టించిన ఈ కేసు వివరాలను మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు బుధవారం వెల్లడించారు. దామరచర్ల మండలం పుట్టలగడ్డ గ్రామానికి చెందిన యువకుడు రూపావత్ నాగు.. మాన్‌తండాకు చెందిన ఓ యువతిని రెండేళ్లుగా ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా లోబరుచుకున్నాడు. ఈ క్రమంలో గతంలో రెండుసార్లు అబార్షన్ కూడా చేయించాడు. విషయం తెలుసుకున్న యువతి తల్లిదండ్రులు పెళ్లి చేసుకోవాలని నాగును కోరారు. సదరు యువతిని పెళ్లి చేసుకుంటే కట్నం రాదని భావించిన నాగు తల్లి బుజ్జి ఎలాగైనా ఆమె అడ్డు తొలగించాలని.. తన అల్లుడు క్రాంతి, కుమారుడు నాగుతో కలిసి పన్నాగం పన్నింది. ఈ నెల 14వ తేదీ రాత్రి సమయంలో నాగు ఇంటికి వచ్చిన యువతి తనను పెళ్లి చేసుకోవాలని గొడవకు దిగింది. దీంతో ఊరిలో పరువు పోయిందని ఆగ్రహించిన నాగు, బుజ్జి, క్రాంతి అనుకున్న పథకం ప్రకారం.. యువతిని బైక్‌పై ఎక్కించుకుని ఊరి చివరన ఉన్న ఓ వ్యవసాయ పొలం వద్దకు తీసుకెళ్లారు. బుజ్జి రోడ్డుపై కాపాలా ఉండగా క్రాంతి, నాగు ఇద్దరూ కలిసి యువతిపై లైంగికదాడి చేశారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన యువతి గొంతు నులిమి ఆమె చనిపోయిందని నిర్ధారించుకుని.. ముగ్గురు కలిసి ఆమె చున్నీతోనే చెట్టుకు వేలాడదీసి ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరించి అక్కడి నుంచి పరారయ్యారు. పోలీసులు సంఘటనా స్థలంలో దొరికిన ఆధారాల ప్రకారం కేసును విచారణ చేపట్టి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా విషయం ఒప్పుకున్నారు. ఇదే కేసులో అనుమానితులుగా ఉన్న రూపావత్ చందు, రూపావత్ రంగ, రూపావత్ భాష్య, రూపావత్ మణి, రూపావత్ శ్రీరాంపై కూడా లోతైన విచారణ చేస్తున్నామని వీరిపై అభియోగాలు నిజమైతే వారిని కూడా అరెస్టు చేస్తామని డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన వాడపల్లి ఎస్‌ఐ, రూరల్ సీఐ వీరబాబును డీఎస్పీ అభినందించారు.

యువతిపై మరో ముగ్గురు లైంగికదాడి?

ఈ నెల 14వ తేదీ రాత్రి సదరు యువతిపై లైంగికదాడి, హత్య సంఘటనలో అరెస్టు కాబడిన ఇద్దరితో పాటు మరో ముగ్గురు యువకులు కూడా ఉన్నారని ప్రచారం జరుగుతోంది. రిమాండ్‌కు తరలించిన ముగ్గురు నిందితులను పోలీస్ కస్టడీకి తీసుకుని పూర్తి సమాచారం రాబట్టాల్సి ఉందని పోలీసులు పేర్కొంటుండగా ఇప్పటికే పోలీసులు ఓ అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. నిందితులు కస్టడీలో తెలిపిన వివరాల ఆధారంగా మరో ముగ్గురు యువకులను కూడా అరెస్టు చేయవచ్చని ప్రచారం జరుగుతోంది. ఆ ముగ్గురిలో ఓ మాజీ సర్పంచ్ కుమారుడు కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

సాగర్ కాలువలో ఇద్దరు గల్లంతు

- మరో మహిళను కాపాడిన స్థానికులు
- నిడమనూరు మండలం బొక్కమంతలపాడులో ఘటన



సాయి



మేదరి శైలజ

త్రిపురారం: ప్రమాదవశాత్తు సాగర్ ఎడమ కాలువలో ఇద్దరు వ్యక్తులు గల్లంతయ్యారు. ఈ సంఘటన నిడమనూరు మండలంలోని బొక్కమంతలపాడు గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండల కేంద్రానికి చెందిన వేదవరపు సాయి (25) కుటుంబ సభ్యులతో కలిసి అడవిదేవులపల్లి రోడ్డులో గత 10 సంవత్సరాల నుంచి కూరగాయల షాపు నిర్వహిస్తున్నాడు. దుకాణంలో పని చేయడానికి మండల కేద్రంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన మేదరి శైలజ, అవిరెండ్ల రమాదేవి కూలి పనికి వెళ్లారు. కూరగాయలు తెచ్చే ట్రేలు కడగడంతో పాటు, బట్టలు ఉతకడానికి తన సొంత టాటా ఏస్ వాహనంలో మేదరి శైలజ, అవిరెండ్ల రమాదేవితోపాటు సాయి నిడమనూరు మండలంలోని బొక్కమంతలపాడులోని ఎడమ కాలువ వద్దకు వెళ్లారు. సాయి కాలువ కట్టపై ఉన్నాడు. శైలజ, రమాదేవి కాలువలో బట్టలు ఉతికి పైకి వస్తున్న క్రమంలో శైలజ కాలుజారి కాలువలో పడింది. శైలజను కాపాడే ప్రయత్నంలో రమాదేవి కూడా కాలువలో పడడంతో సాయి గమనించి అందులోకి దిగాడు. వెంటనే స్థానికులు వచ్చి చీరల సాయంతో అవిరెండ్ల రమాదేవిని కాపాడారు. శైలజ, సాయిని కాపాడే సమయంలో నీటి ఉధృతికి వారు లోపలికి కొట్టుకుపోయారు. సమాచారం తెలుసుకున్న నిడమనూరు ఎస్‌ఐ గోపాల్ రావు పోలీస్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నీటి ఉధృతి అధికంగా ఉండడంతో వారు పెద్దదేవులపల్లి రిజర్వాయర్‌కు కొట్టుకురావచ్చని పోలీసులు భావిస్తున్నారు. గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు నిడమనూరు ఎస్‌ఐ గోపాల్ రావు తెలిపారు.



బొక్కమంతలపాడు ఎడమ కాలువ వద్ద రోదిస్తున్న సాయి కుటుంబ సభ్యులు

అదుపు తప్పి ఆటోపైకి దూసుకెళ్లిన ట్రాక్టర్

సూర్యాపేటటౌన్: జిల్లా కేంద్రంలో బుధవారం ట్రాక్టర్ అదుపు స్కూల్ పిల్లల ఆటోపైకి దూసుకెళ్లింది. ఈఘటనలో ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన దైద సందీప్ స్కూల్ పిల్లల ఆటో తోలుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగా స్కూల్ పిల్లలను ఆటోలో ఎక్కించుకొని తీసుకెళ్తుండగా పట్టణంలో 60ఫీట్ రోడ్డు సమీపంలో రాగానే ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ అజాగ్రతగా నడపడంతో ఒక్కసారిగా ఆటోపై దూసుకువచ్చింది. దీంతో ఆటో డ్రైవర్ అందులో ఇరుక్కుపోగా అతడికి గాయాలయ్యాయి. ఇద్దరు విద్యార్థులు సురక్షితంగా బయటపడ్డారు. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని క్రేన్ సాయంతో ఆటోను, ట్రాక్టర్‌ను వేరు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు.

కూలిన ఇంటి పైకప్పు



తాటికోల్ గ్రామంలో కూలిన ఇంటి పైకప్పు

దేవరకొండ: రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి దేవరకొండ మండలం తాటికోల్ గ్రామానికి చెందిన దస్తగిరి ఇంటి పైకప్పు బుధవారం కుప్పకూలింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. పంచాయతీ కార్యదర్శి మూర్తి అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు.శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఎవరూ ఉండొద్దని కోరారు.

చేపల వేటకు వెళ్లి యువకుడు మృతి



సతీష్ మృతదేహం

కోదాదరూరల్: చేపల వేటకు వెళ్లిన యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ సంఘటన కోదాడ పట్టణ పరిధిలోని పెద్దచెరువు వద్ద బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతగిరిరోడ్‌లో నివాసం ఉండే గుడిమళ్ల సతీష్ (32) తాపీ పని చేస్తుంటాడు. సతీష్ తన భార్య అపర్ణ, బావమరిది జంపాల భద్రయ్యలతో కలిసి పెద్దచెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో విద్యుత్‌పోల్‌కు వైర్ తగిలించి చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అక్కడే ఉన్న భార్య, బావమరిదితోపాటు మరికొందరు కలిసి పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య అపర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ కేపీ చారి తెలిపారు.

ముగిసిన హోంగార్డు వసంత్‌కుమార్ అంత్యక్రియలు



హోంగార్డు వసంత్‌కుమార్ అంత్యక్రియల్లో పాల్గొన్న ఎస్‌ఐ సతీష్‌రెడ్డి

హాలియా: హాలియా పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు వసంత్‌కుమార్(43) అనారోగ్య కారణంగా మంగళవారం మృతి చెందాడు. ఆయన అంత్యక్రియలు బుధవారం హాలియా పట్టణంలో నిర్వహించారు. వసంత్‌కుమార్ మంగళవారం ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురికావడంతో చికిత్స నిమిత్తం నల్లగొండలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు. మంగళవారం రాత్రి ఆయన మృతదేహాన్ని హాలియా పట్టణంలోని స్వగృహానికి తీసుకువచ్చారు. హాలియా సీఐ జనార్దన్ గౌడ్, ఎస్‌ఐ సతీష్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వర్ర వెంకట్‌రెడ్డి, డీఈ ఆంజనేయులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పలువురు వసంత్‌కుమార్ మృతదేహానికి నివాళులర్పించారు. అంతిమ యాత్రలో స్థానిక ఎస్‌ఐ సతీష్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణ బస్టాండ్‌లో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. స్థానిక సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ బస్టాండ్‌లోని బేంచ్‌పై మధ్యాహ్నం సమయంలో సుమారు 40 ఏళ్ల వయసు ఉన్న వ్యక్తి పడుకొని ఉన్నాడు. గమనించిన ఆర్టీసీ కంట్రోలర్ గొల్లూరి ఇస్తారి అతడి దగ్గరకు వెళ్లి పరిశీలించాడు. ఉలుకు, పలుకు లేకపోవడంతో మృతిచెందాడని గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించగా వివరాలేవీ దొరకలేదు. కంట్రోలర్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ వెల్లడించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి తీవ్రగాయాలు

వలిగొండ: విద్యుదాఘాతంతో వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన వలిగొండ మండలంలోని వెల్వర్తిలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెల్వర్తి గ్రామానికి చెందిన పిట్టల రవి మధ్యాహ్నం సమయంలో ఇంటి వద్ద బోరు మోటార్ రిపేర్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై గాయపడ్డాడు. బాధితుడి కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకొని చికిత్స నిమిత్తం భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

మేళ్లచెరువు: జిల్లాలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు జిల్లా విద్యుత్ శాఖ ఎస్‌ఈ ఫ్రాంక్‌లిన్ తెలిపారు. బుధవారం మేళ్లచెరువు మండలంలోని కందిబండ సబ్‌స్టేషన్‌లో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గతంలో కందిబండ సబ్‌స్టేషన్‌లో 5000 కేవి ట్రాన్స్‌ఫార్మర్ ఉండగా ఓవర్ లోడ్ కారణంతో తరచూ సమస్యలు వస్తుందని, దాని స్థానంలో రూ.1.02 కోట్లతో 8000 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మరో 5 సంవత్సరాల వరకు ఓవర్ లోడ్ సమస్య తలెత్తదన్నారు. అదేవిధంగా హుజూర్‌నగర్ డివిజన్‌లో 8600 వ్యవసాయ కనెక్షన్‌లు ఉండగా మరో 5700 కనెక్షన్‌లు పెండింగ్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. గృహజ్యోతి కనెక్షన్ల కోసం రూ.6 కోట్లు ప్రతినెలా ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు కోదాడ, హుజూర్‌నగర్ డివిజన్‌లో విద్యుత్ సంస్థకు సుమారు రూ.7కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు చెప్పారు. సుమారు 150కి పైగా వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు మునిగిపోయినట్లు తెలిపారు. ప్రస్తుతం పూర్తిస్థాయిలో పనులు పూర్తిచేసి వినియోగదారుల సమస్యలు పరిష్కరించడం జరిగిందన్నారు. ఆయన వెంట డీఈ వెంకటకృష్ణయ్య, దాలి నాయుడు, ఇందిరా రెడ్డి, ఏఈ వెంకటేశ్వరరెడ్డి, లైన్‌మెన్ చిన్నా నాయక్ తదితరులున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

వలిగొండ: మండలంలోని ఎదుళ్లగూడెంలో బుధవారం ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాల ప్రకారం.. ఎదుళ్లగూడేనికి చెందిన బర్మ అఖిల (22) ఇంట్లో ఉన్న ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి సమాచారం ఇవ్వగా బాధితురాలిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా.. మహిళ ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు.

త్రిపురారంలో 12.9 సెంటీమీటర్ల వర్షపాతం

నల్లగొండ: జిల్లాలో పలు మండలాల్లో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు భారీ వర్షం కురవగా మరికొన్ని మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. త్రిపురారం మండలం కామారెడ్డిగూడెంలో 12.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. దామరచర్ల మండలం తిమ్మాపురంలో 12.2 సెం.మీ, శాలిగౌరారంలో 9.5, అడవిదేవులపల్లి మండలం మల్కచర్లలో 8.5, నార్కట్‌పల్లిలో 7.7, నిడమనూరులో 6.2, వేములపల్లి మండలం బుగ్గబాయిగూడెంలో 6.0, మిర్యాలగూడ మండలం టీక్యాతండాలో 5.7, దోమలపల్లిలో 5 సెం.మీ. వర్షపాతం నమోదైంది. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలంలో 8.1 సెంటీమీటర్లు, మోతె మండలం ఉర్లుగొండలో 6.5, మద్దిరాల మండలం రెడ్డిగూడెంలో 5.3, అనంతగిరి మండలం శాంతినగర్‌లో 5.1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. యాదాద్రి జిల్లా మోత్కూర్ మండలంలోని దత్తప్పగూడెంలో 8.7, అడ్డగూడూరులో 7.0, గుండాలలో 6.8, చౌటుప్పల్ మండలం తుప్రాన్‌పేటలో 6.4, రాజాపేటలో 6.0 వర్షపాతం నమోదైంది.

వరిని ఆశిస్తున్న ఎండాకు తెగులు

- యాజమాన్య చర్యలు చేపట్టాలని సూచిస్తున్న కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాసరావు



శ్రీనివాసరావు

త్రిపురారం: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బోర్లు, బావులు, ఇతర సాగు నీటి వనరులతో పాటుగా నాగార్జున సాగర్ ఎడమ కాలువ పరిధిలో సాగు చేసిన వరి పంటలు వాతావరణ మార్పుల కారణంగా ఎండాకు తెగులు ఉధృతి అధికంగా ఉంది. దీని నివారణకు సకాలంలో యాజమాన్య చర్యలు చేపట్టాలని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు పేర్కొంటున్నారు.

ఎండాకు తెగులు సోకడానికి కారణాలు..

సెప్టెంబర్– అక్టోబర్‌లో కురిసే వర్షాలు, తక్కువ ఉష్ణోగ్రతల కారణంగా వరిలో ఎండాకు తెగులు ఆశించడానికి దోహదం చేస్తాయి. నారు మడి దశ నుంచి గింజ పాలు పోసుకునే వరకు తెగులు ఆశించే అవకాశం ఉంటుంది. చెట్టు నీడ పడే ప్రదేశంలో ఎక్కువగా ఎండాకు తెగులు ఆశించి మిగిలిన పంటకు వేగంగా వ్యాపిస్తుంది.



వరి పంటకు సోకిన ఎండాకు తెగులు

పాడి-పంట

తెగులును గుర్తించే విధానం

వరి పంటలో ఎండాకు తెగులు సోకిన ప్రదేశంలో ముందుగా ముదురు ఆకులకు పసుపు రంగు మచ్చలు ఏర్పడి పైనుంచి కింది అంచుల వెంబడి వ్యాపించి ఎండుతూ వస్తాయి. ఉదయం సమయంలో గమనిస్తే ఆకుల మీద పసుపు రంగు జిగురు ముద్దలు కనబడతాయి. ఎండ వేడిమికి గట్టిపడి రాలిపోతాయి. ఈ ఎండిన బాక్టీరియా ముద్దలు నీటి ద్వారా వెళ్లి మిగిలిన పంటకు వ్యాప్తిస్తుంది.

నివారణ చర్యలు

బ్యాక్టీరియా వ్యాప్తి నివారణకు తెగులు సోకిన మొక్కల నుంచి ఆరోగ్యకరమైన పంటకు నీరు పారకుండా చూసుకోవాలి. తెగులు ఆశించిన పోలంలో నత్రజని వేయకూడదు. కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు మరియు ప్లాంటోమైసిన్ 4 గ్రాములు (లేదా) పోషామైసిన్ (లేదా) స్ట్రెప్టోసైక్లిన్ 4 గ్రాములు 10 లీటర్ల నీటిలో కలిపి 2 నుంచి 3 సార్లు వారం వ్యవధిలో పిచికారీ చేసుకోవాలి.